కథా నిలయం
శ్రీకాకుళం

# 1

# చైత్రపూర్ణిమ

“జయం! కాశ్మీర మహారాజ్ఞీః జయః”

శ్రీలేఖ జన్మదినమహోత్సవ శుభసమయంలో ఆమె ప్రధాన పరిచారిక రత్నావళి రవంత ఎలుగెత్తి, ఎంతో ఆత్మీయంగా, సగౌరవంగా మూడుమారు అభినందించింది.

ఆనాడు చైత్రపూర్ణిమ. అదే శ్రీలేఖ జన్మించిన దివసము. నాటితో ఆమె ప్రాయంలో ఇరవైనాలుగేళ్ళ కాలం గడిచిపోయింది.

రత్నావళి శ్రీలేఖ కానాడెంతో మనోహరంగా సరికొత్త రీతిలో అలంకరణం ప్రారంభించింది.

గోధుమవన్నె చీనాంబరంమీద లేత లేత పసుపు ఛాయ కంచుకంలో ఎర్ర ఎర్రని నెమ్మేని తళతళలతో కనుదోయికి మిరుమిట్లు కలిగిస్తున్న ఆమె కెన్నెన్ని క్రొంగ్రొత్త రీతులలో అలంకరించినా, ప్రధానపరిచారిక కెంతసేపటికి తనివితీరలేదు.

పద్మరాగాల మాలిక కాదని, పచ్చలతో పొదిగిన ముప్పేట కట్టాణి ముత్యాలహారం మెడలో అమర్చి రవంతసేపు పరిశీలించింది. చిన్నారి పైడిమువ్వల మొలనూలు నెన్నడుముచుట్టు బిగించింది. లత్తుకతో గండు తుమ్మెదల చిత్తరువులు చిత్రించిన చరణాలపై ముత్యాల మువ్వల అందె అలంకరించి, క్షణకాలం సోయగం పరీక్షించింది. ముంగురులలో సన్నజాజి పూల మాలిక వ్రేలాడగట్టింది. చెక్కిళ్ళపై పండు మొగలిపూల పుప్పొడి అద్ది, నెన్నుదుటిపై సన్నని కస్తూరీతిలకం తీర్చిదిద్దింది.

పొద్దుటి నీరెండ పడి, మిణుగురు లెగురుతున్నట్టు మెరు స్తున్న వెండిపూత నిలువుటద్దం పట్టపురాణి ముందుంచి, మహారాజ మర్యాదప్రకారం తిరిగి జయ జయాభినందన లందించింది.

రవంత శిరఃకంపంతో, మొలకెత్తుతున్న చిరునగవుతో శ్రీలేఖ ఆ అభినందన లందుకున్నదన్న మాటేగాని, మరు నిమేషం లోనే రాజహంసల తూలికలతో అమర్చిన శయ్యాసనంమీద ఓరగా ఒరిగి, చెక్కిలిపై చెయ్యి చేర్చి, ఊపిరి అంతా ఒక్కమారుగా విడిచి వేస్తున్నట్టు ఉసూరుమని నిశ్వసించింది. దుర్భర దైన్యంతో దీర్ఘాలో చనలో పడింది.

రత్నావళి ఆ విపరీత ధోరణి గమనించి నిర్ఘాంతపడింది.

"మహారాజ్ఞీ! నేడు మీరు పుట్టిననాటి మహోత్సవం కదా! అన్నివిధాలా పెట్టిపుట్టినవారు మీ రెందుకిలాగ దిగులుపడుతున్నారో నా కేమి బొత్తిగా బోధపడడంలేదు."

కొంచెం సంకోచిస్తూ నసుగుతూ అడిగింది.

"నీనోట జయాభినందన వినగానే నాకు జయాకరు లొక్క మారుగా జ్ఞప్తికి వచ్చారే రత్నా! ఆయన సంగతి అంతా నీ కింతకు మునుపే ఒకసారి చెప్పినట్టున్నాను....గుర్తు వచ్చిందా?"

రత్నావళి మరింతగా నిర్ఘాంతపడింది.

"నా దగ్గిర ఆయన మాటే మీ రెన్నడు ప్రస్తావించలేదమ్మా! ....నిజమే, నేనేమి పొరబడడంలేదు. అయితే మీ వేలువిడిచిన మేన మామల కుమారులు—ఆ జయాకరుల మాటేనా మీ రనేది?"

"అవును. ఆయనమాటే నే ననేది! నీతో నే నెన్నడు ఆయన సంగతే చెప్పలేదా?....ఎందుచేతనో నా కీ మధ్యన విపరీతంగా మతి మరుపు పట్టుకున్నదే రత్నా!.....సరేలే! చెబితేమాత్రం ఒక్కో ఒరి గేది ఏమి ఉందిలే! నీవేమయినా ఆర్చగలవా? తీర్చగలవా? నీవే కాదు, ఇక ఎవ్వరయినా చెయ్యి గలిగింది మాత్రం యేమి మిగి లింది లే!...."

తిరిగి సుదీర్ఘంగా నిట్టూర్చింది శ్రీలేఖ. రత్నావళి రవంతసే పాలోచించింది.

"అదేమిటమ్మా! అలాగ సెల విస్తారు! కొండమీది చంద మామ నయినా అవలీలగా అందుకోగల మీవంటి మహారాణులే అలాగ అధైర్యపడిపోలే. ఇక నేనేమి విన్నవించుకోగలను? నా వల్ల అయ్యే పని అయితే ప్రాణాలొడ్డి అయినా శాయశక్తులా ప్రయ త్నించి సాధించుకు రాలేనా?"

నిశ్చల నేత్రాలతో శ్రీలేఖ మరికొంతసే పాలోచించింది.

"నీవే కనక ఇది సాధించుకువస్తే ఎంతటి బహూమానం కోరినా కాదనక కటాక్షిస్తానే రత్నా!"

"అదేమిటి మహారాజ్ఞీ! అంతటి మాటంటారు? మీ రాజ్ఞా పించిన కార్యం నెరవేర్చడానికని ప్రత్యేకంగా బహూమతీ అనుగ్ర హించాలా? ఇంతకీ ఏమి టా జయాకరుల వ్యవహారం?"

శ్రీలేఖ మరికొంతసేపు మథనపడి గొంతు బాగా తగ్గించి వేసింది.

"రత్నా. నీవిది అతి రహస్యంగా నీ మనస్సు అట్టడుగునే దాచివేసుకోవాలి సుమా!"

"అదేమిటమ్మా! నా కేదో కొత్తగా ఆజ్ఞాపిస్తున్నట్టు సెల విస్తున్నారు! మీ రతిరహస్యంగా చెవిలో చెప్పిన మాట నే నెన్న డయినా అవంతయినా పైకి పొక్కనిచ్చానా?....మీ రిలాగ సెల వియ్యడం న్యాయమేనా?"

రత్నావళి రవంత మనస్సులో కష్టపెట్టుకున్నట్టు కనురెప్ప లార్కించుక వంచివేసి బ్రతిమాలుకున్నది.

శ్రీలేఖ ఆమె నింకా దగ్గిరికి పిలిచి సరసనే కూర్చో బెట్టుకుని తన రహస్యగాథ బయటపెట్టేముందు డగ్గుత్తికతో మాట పెగలక, చెక్కిళ్ళపై ప్రవహిస్తున్న కన్నీటితో తిరిగి దీర్ఘాలోచనలో పడింది.

మహారాణి శ్రీ లేఖ క్రీస్తుశకం పదకొండవ శతాబ్దం ప్రారం భంలో కేవలం స్వకీయ చాకచక్యంతో కాశ్మీరసింహాసనం కైవసం చేసుకున్న సంగ్రామదేవుని పట్టపురాణి.

అయితే ఆమె అగర్భశ్రీమంతుని కుమార్తె కాదు. శ్రీలేఖ

తండ్రి యశోమంగళసేనాని చిరకాలం చెమట ఓర్చి పరిశ్రమించి. ఎట్టకేలకు చిట్టచివరికి కాశ్మీర సైన్యాల కన్నింటికి ప్రధాన దండ నాయకు డనిపించుకున్నాడు. అంతేకాదు. క్రమక్రమంగా మహైశ్వర శాలి అన్న ఘన ప్రతిష్ఠ కూడా సంపాదించుకున్నాడు.

శ్రీలేఖ యశోమంగళుని ఏకైక పుత్రిక. అందువల్ల చిన్నప్పటి నించి ఎంతో గారాబంగా పెరిగింది. ఆమె అపూర్వ సౌందర్యవతి కాకపోయినా. పదిమంది పడుచుల మధ్య నిలుచున్నప్పుడు అందరి చూపులు ఇట్టే ఆకట్టుకోగలదు. ఆపైన ఆ ప్రాచీన కాలంలో సుక్ష త్రియ మహిళ లభ్యసించే సంగీతనృత్యాది లలితకళ లన్నింటి లోను తగినంత ప్రావీణ్యం గడించుకున్నది.

ఆమె దూరబంధువుల కుమారుడు జయాకరుడు కొంచెం ప్రాయం వచ్చినప్పటినించి యశోమంగళుని భవంతిలోనే ఉంది. క్రమ క్రమంగా కాశ్మీరవాహినిలో నూరుగురు అశ్వికుల దళాని కాధి పత్యం సంపాదించుకున్నాడు. ధైర్యసాహసాలలోనేకాక. యుద్ధ వ్యూహాలనిర్మాణంలోకూడా నానాటికి అతని కీర్తి ఇనుమడించింది.

ఏదో దూరపు చుట్టరికం వరస ప్రకారం యశోమంగళుడతనికి వేలు విడిచిన మేనమామ అవుతాడు. కనక శ్రీలేఖ నతనికిచ్చి వివాహం చెయ్యాలన్న సంకల్పంతోనే యశోమంగళు డతనిని చిన్న నాటినించి చేరదీసి ఉండవచ్చునని దగ్గిర బంధువులలో కొంద రూహించడం కూడా జరిగింది.

శ్రీలేఖ తల్లి మనస్సులో కూడా అటువంటి ఆలోచనే మొలకెత్తింది. దాని కింకొక కారణం కూడా తోడుపడింది. శ్రీలేఖ చిన్ననాటినించి జయాకరుడంటే ఎంతోఇష్టపడుతున్నదని ఆమె కని పెట్టింది. అదీగాక జయాకరుడు యశోమంగళుని దగ్గిర ఎంతో అనువర్తనగా ఉంటూ, తలలో నాలుకలా మసులుకుంటున్నాడు. శ్రీలేఖ మీద మమకారం పెంచుకుంటున్నాడు. మేనమామ ప్రాపకం వల్ల నేటికి కాకపోతే రేపటి కయినా క్రమక్రమంగా అతని అధి కారము, ప్రాభవము, ఐశ్వర్యము అతిశయించగలవు.

ఆపైన తల్లిదండ్రు లతని బాల్యంలోనే ఇహలోక యాత్ర

చాలించారు. దానా, దీనా అతనిని సర్వదా తమ భవంతిలోనే అట్టే పెట్టుకోవచ్చునని ఆమె ఆశించింది.

అయితే ఆమె స్వతః పెనిమిటి అంతర్యాన్నిబట్టి సరిపెట్టు కునిపోయే సాధ్వి. అందుచేత భర్త ఆలోచనలమీదనే శ్రీలేఖ పరి ణయ భారం అంతా మోపి, నిశ్చింతగా ఆ శుభ ముహూర్తం కోసం నిరీక్షించింది. ఇంతకీ ఆదైవ సంకల్పం ప్రకారమే అన్ని వాటంతట అవే జరిగిపోగలవని సంతృప్తి పడింది. అందుచేతనే క్రమక్రమంగా ఆ వ్యవహారాన్ని గురించిన ఆలోచనలే మానుకున్నది.

అలాగలాగ మరికొంత కాలం గడిచింది. శ్రీలేఖ కిరవై ఏళ్ళ ప్రాయం నిండింది. అదేసమయంలో కాశ్మీరం పసిడి గద్దెపై సంగ్రామ దేవుని పట్టాభిషేక మహోత్సవంతో బాటు, ఆ దేశంలో అంతట అతని శాత్రవుల అల్లకల్లోలా లారంభమయ్యాయి.

తన మేనత్త దుర్గాదేవి ఏర్పరచిన సామర్థ్య తారతమ్య పరీ క్షలో అఖండ విజయం సాధించినందువల్లనే సంగ్రామ దేవునికి కాశ్మీరాధికారం స్వాయత్తమయింది. అంతేకాని, వంశపారంపర్యం ద్వారా చేజిక్కిన సింహాసనాధిపత్యంకాదది. అందువల్లఆవిధమయిన నిర్ణయాని కిష్టపడక కాశ్మీరు సింహాసనానికి వారసుల మనుకున్నవా రనేకులు దేశంలో నలువైపుల తిరుగుబాటులు కొన్ని లేవతీశారు. అంతేకాదు. ప్రధాన సేనాని యశోమంగళుని కూడా తమవైపు తిప్పు కోవాలని వారందరు శతవిధాల ప్రయత్నించారు.

కాని అత డెక్కడ చలించలేదు. సుస్థిర ప్రభు భక్తితో సంగ్రామ దేవుని వైపు నిలిచి, తిరుగుబాటులు బయిలుదేర దీసిన పగవారి నందరిని నిశ్శేషంగా నిర్మూలించాడు.

ఆ కల్లోలాల సమయంలో సంగ్రామదేవు డనేక పర్యాయాలు మహారాజ మర్యాదలన్ని విడిచిపెట్టి స్వయంగా యశోమంగళుని భవ నానికి రాకపోకలు కొనసాగించాడు. అందువల్ల క్రమక్రమంగా వారి ద్దరి మధ్య ప్రగాఢమయిన గౌరవానుబంధం బలపడింది.

యశోమంగళుని శక్తి సామర్థ్యాలు, రాజ్య వ్యవహార నైపుణి, ప్రభుభక్తి నిశితంగా పరిశీలించిన సంగ్రామ దేవుడు అతని

తోడ్పాటెల్లప్పుడు తన సింహాసనాధిపత్యానికొక పెట్టని కోటగా పరిణమించాలని అభిలషించాడు. అదేసమయంలో శ్రీలేఖ అయిదారు సార్లు లతని కంటపడడం జరిగింది. మరికొన్ని వారాలలోనే సంగ్రామదేవు డామెను పట్టపురాణిగా స్వీకరించగోరుతున్నట్టు స్వకీయాభిలాష వెల్లడించాడు.

యశోమంగళు డామె పట్టపురాణి కాగలదని కాని, కావాలని కాని కలలోకూడా అనుకోలేదు. కనక తలవని తలంపుగా తటస్థపడిన ఆ మహాదృష్టలక్ష్మి అతనికొక పెన్నిధిలా సాక్షాత్కరించింది! అంతేకాదు. శ్రీలేఖ పట్టపురాణి కాబోతున్నందువల్ల ఆనాటి కానాటికి తన అధికారైశ్వర్యాలు మరింతగా పెంపొందగలవని కూడా అతడువ్విళ్లూరిపోయాడు! కనక ఆ వ్యవహారంలో జయాకరుని మాట అతడిక ఆలోచించదలుచుకోలేదు. అదే సంగతి చల్లగా తన ఇల్లాలి చెవిని వేశాడు. కుమార్తె కాశ్మీర మహారాణి కాబోతున్నదని విని ఆమె పరమానంద భరితురాలయింది. శ్రీలేఖ గొప్ప అదృష్టవంతురాలని మురిసిపోయింది.

కాని శ్రీలేఖ తన భావిభాగ్యాని కెంతమాత్రము ఉత్సాహపడలేదు. పైగా తన బిడియంవల్ల వివాహ వ్యవహారం విషమించ బోతున్నదని ఇను మిక్కిలిగా ఆందోళన పడింది. చిట్టచివరికొకనాడు నోరు విడిచి తల్లి దగ్గర తన ఆంతర్యం బయట పెట్టింది. మహారాజ్ఞీ గౌరవం తన కక్కరలేదని నిష్కర్షగా చెప్పి వేసింది. జయాకరునితో తన వివాహం జరిపించ వలసిందని కన్నీరొత్తుకుంటూ తల్లి దగ్గర మొరపెట్టుకున్నది.

ఎంతయినా తల్లి ప్రాణం కదా! ఆమె కేమనడానికి పాలుపోలేదు. ఆనాటి రాత్రే ఆ సంగతి భర్తతో సంప్రతించింది.

అయితే అత డామె మాట లేవి తిన్నగా వినిపించుకోనేలేదు! తన బాగోగుల సంగతి ముక్కుపచ్చలారని శ్రీలేఖ కేమి తెలుసునని విదిలించి వేశాడు. పైగా ఆమె సిరిరా మోకాలొడ్డుతున్నదని శాసించు కున్నాడు. "ఆ! చిన్ననాటి అనుబంధా లెంతో కాలం నిలుస్తాయా? ఇది అంతా వట్టి వెర్రి!" అని చప్పరించి వేశాడు. పట్టపు

రాణి అయిన పిమ్మట శ్రీలేఖ భాగ్యభోగాలలోపడి, జయాకరుని మరిచిపోయి తీరగలదని గట్టిగా భరవసా ఇచ్చాడు.

శ్రీలేఖ తల్లికూడా కుమార్తెకదే శ్రేయస్కరమయిన మార్గ మని అంగీకరించింది. శ్రీలేఖ కనేక విధాల అదేమాట నచ్చచెప్పి, చల్లని పలుకులతో బుజ్జగించింది. మూతి ముక్కు బిగించి కూర్చున్న ఆమె మౌనమే అర్ధాంగీకారమని భావించింది. క్రమ క్రమంగా అదే పరిపూర్ణాంగీకారంగా పరిణమించ గలదని సరిపెట్టు కున్నది.

ఆపైన వివాహ శుభముహూర్తం నిర్ణయించే పర్యంతము యశోమంగళుడా వృత్తాంతం కొంచెమయినా పైకి పొక్కనియ్య లేదు. ముఖ్యంగా జయాకరుని కా వ్యవహారం రవంతయినా తెలియ నియ్యవద్దని ఇల్లాలిని గట్టిగా హెచ్చరించాడు. అంతే కాదు. చిట్ట చివరి క్షణం వరకు శ్రీలేఖకే ఆ సంగతి తెలియనియ్యలేదు!

మరి కొంత కాలానికి కా వార్త విన్న జయాకరు డొక్క మారుగా పిడుగు మొత్తినట్టు నిలువునా నిర్ఘాంతపడ్డాడు. శ్రీలేఖ కూడా తనతో ఆ మాటయినా ప్రస్తావించక పోవడంవల్ల పట్టపురాణి కావడాని కామె ఎంతో ఉవ్విళ్లూరు తున్నదని నిర్ణయించుకున్నాడు. పైపైకి నిరుత్సాహంగా ఉన్నట్టు కనిపిస్తున్నా అది తన కోసం చేస్తున్న నటన అయిఉండవచ్చునని అనుమానించాడు. కాశ్మీరాధిపతి వంటి మహైశ్వర్యశాలి భర్తగా లభిస్తున్నప్పు డామె ఆ విధంగా మారి పోవడంలో ఆశ్చర్యమేమి లేదని తన అనుమానం దృఢపరుచు కున్నాడు.

అంతే కాదు. మేనత్త మేనమామలవల్లనే కాక, శ్రీలేఖవల్ల కూడా తన కెంతో తీరని ద్రోహం జరిగిపోయిందని కుత కుత లాడి పోయాడు!

అత డప్పటి నుండి శ్రీలేఖ మాట వింటూనే దూరదూరంగా తొలిగిపోయాడు. ఆమె వైపు కన్నెత్తి చూడడానికి కూడా జయాకరు డిష్టపడలేదు. అత్త మామలతో అత డంతకన్న ముభావం మొదలు పెట్టాడు.

అపైన ఆ భవంతిలో నివసించడమే తన కెంతో తలవంపని అతని కనిపించింది. ఆ మరునాడే వేరొక భవంతికి తరలిపోతున్నట్లు చెప్పి అత్తమామ లిద్దరి దగ్గిర ఎంతో మర్యాదగానే సెలవు తీసుకున్నాడు. అప్పుడప్పుడు ఎప్పుడయినా వచ్చి పలకరించి పోతూండ వలసినదని వా రన్న మాటల 'కలాగే' అని మాటవరస కని అంగీకరించి, తెల్లవారగానే ఆ భవంతినించి నిష్క్రమించాడు. చిట్టచివరికి వెళ్ళిపోయే సమయంలో నయినా శ్రీలేఖ వైపు కన్నెత్తలేదు.

మరికొన్ని వారాలలోనే శ్రీలేఖా సంగ్రామ దేవుల వివాహం మహనీయ వైభవంతో జరిగిపోయింది. కాని జయాకరుడా వివాహాని కయినా పోలేదు. కాశ్మీరంలో సుప్రసిద్ధమయిన ప్రవర నగరంలో వల్లమాలిన రాచకార్యమేదో వచ్చిపడిందని చెప్పి, శ్రీలేఖ వివాహానికి పూర్వమే అక్కడికిపోయి, ఆ విధంగా ముఖం తప్పించి వేశాడు. అటుపిమ్మట మరికొన్ని దివసాలలోనే శ్రీలేఖ అంతఃపుర ప్రవేశం కూడా జరిగిపోయింది. జయాకరు డంతవరకు యశోమంగళ సేనాని గడప తొక్కలేదు.

అయితే ఆ తరవాత జయాకరు డెప్పుడయినా అతని భవంతికి పోయినా అంటీ అంటని మర్యాదతోనే కాలక్షేపం చేసి పైపైకి మాత్రమే బంధు మర్యాద నిలబెట్టుకున్నాడు. నిజానికి జయాకరు డతని అధికారానికి లోబడిన ఒక చిన్న అశ్వికదళాధిపతి కావడమే దానికొక ప్రధాన కారణము: అతని కప్పటినించి వివాహం అంటేనే విపరీతమయిన విరక్తి పట్టుకుంది. అయినా మరికొంత కాలానికి ఆత్మీయ బంధువుల పోరుపడలేక వారిలో ఒకరు ఎన్నిక చేసిన వధువు నంగీకరించి, ఆ బెడదలోనించి బయటపడ్డట్టు భావించి తల తడిమి చూసుకున్నాడు.

కాని శ్రీలేఖ కాతని ఎడల గాఢానురక్తి అవంతయినా సడలలేదు. పైగా అది నానాటికి మరింతగా ప్రబలమయింది. అలాగ మరి రెండు మూడేళ్లు గడిచిన పిమ్మట ఆ ప్రాచీన కాలంలో మహారాజ మర్యాద ప్రకారం సంగ్రామ దేవుని అంతఃపురంలో మరి ఇద్దరి రాణుల ప్రవేశం సర్వసాధారణంగా జరిగిపోయినట్టు జరిగిపోయింది.

శ్రీలేఖ అప్పటినించి మరింత ఒంటరితనంతో దిగులుపడింది. అప్పటికి కూడా ఆమె గర్భవాసం ఫలించక పోవడం కూడా దానికొక కారణంగా జతపడింది.

ఎంతగా ప్రయత్నించినా జయాకరుని వృత్తాంతం మరిచి పోవడాని కామె కేమాత్రము శక్యం కాలేదు. పైగా అతనిని గూర్చిన ఆలోచనపీడని నీడలా శ్రీలేఖ నెల్లవేళల వెన్నాడింది. క్రమక్రమంగా బ్రతుకంతా ఆమెనొక దుర్భరమయిన భారంగా కుంగదీసింది. ఆ పరిస్థితిలో జయాకరునికి తన మీద విపరీతమయిన ఏహ్యభావం కలిగి ఉండవచ్చునన్న ఆలోచన ఆమె అంతరాంతరాలలో ఆరని చిచ్చులా ప్రజ్వలించింది. అటువంటి ఈసడింపువల్లనే అతడెన్నడు మరి తన కంటపడలేదని గ్రహించుకుని ఆమె కుమిలి కుమిలి దుఃఖించింది. ఒక్కొక్కప్పు డామె ఆవేదన భరించలేక అతనిని గురించిన ఆలోచనే మానుకోవాలని కూడా ప్రయత్నించకపోలేదు. అయినా జయాకరుని స్మృతి మరింత దృఢంగా, తీవ్రంగా ఆమె హృదయంలో స్థిరపడి వేధించింది. 'అయ్యో! మనసారా వలచిన జయాకరులకే ఇంతటి ద్వేషం కలగడానికి పూర్వజన్మలో నేనెంతటి ఘోర పాతిత్యాని కొడిగట్టుకున్నానో కదా?' అనుకుని చీరచెరగుతో బొటబొటమని ప్రవహిస్తున్న కన్నీరొత్తుకున్నది.

"మహారాజ్ఞీ! ఎందుకు మీకింతటి మనోవ్యథ! ఆ జయాకరుల సంగతి కొంచెం నా చెవిని వెయ్యరాదా? నామీద మీ కిప్పటికి నమ్మకం కలగలేదా?"

రత్నావళి నోట వెలువడిన ఆ ప్రార్థనతో శ్రీలేఖ తటాలున తిరిగి ఈ లోకంలో పడింది.

"నీమీద నమ్మిక లేక కాదే రత్నా! ఈ కోరిక నెరవేరుతుందో నెరవేరదో అని నాకే ధైర్యం కలగడంలేదే!"

తిరిగి కన్నీ రొత్తుకున్న శ్రీలేఖ రత్నావళికి జయాకరునికి, తన కుటుంబానికి, తనకు మధ్యన నడిచిన వ్యవహారం అంతా అవసరమయినంతవరకు సంగ్రహంగా వెల్లడించి, తనమీద అతని హృదయంలో ఎంతయినా అక్కసు పేరుకొని ఉండవచ్చు నన్న

వ్యథ వ్యంగ్యంగా వెల్లడించింది. మరికొంతసేపు మౌనం వహించి, తిరిగి అదే ప్రసంగం ప్రారంభించి, చిన్నతనంలో తా మిద్దరు కలిసి చైత్రపూర్ణిమ పండువెన్నెలలో బాల్యక్రీడలతో మైమరచిన విషయం ప్రస్తావించి, ఆనాడే అతనిని వివాహం చేసుకోవాలన్న అభిలాష తనలో మొగ్గ తొడిగినట్టు వ్యక్తీకరించి, ఉసూరుమని నిట్టూర్చింది.

"కళ్ళారా ఆయన నొక్కమారు చూచి,అలాగే ప్రాణం విడిచి పెట్టాలని ఉన్నదే రత్నా! నీ వాయనదగ్గిరికి పోయి బ్రతిమాలి,బామాలి ఒక్కమా రిక్కడికి విచ్చేసేటట్టు నచ్చజెప్పగలవా? ఇంతకన్నా నా కీ జన్మలో మరి కోరుకోవలసినదేది లేదే!"

ప్రధాన పరిచారిక రెండు మూడు క్షణాలపాటు తటపటాయించింది.

"అయితే ఇంత జరిగిన తరవాతకూడా ఆయన మీ ప్రార్థన మన్నిస్తారా మహారాజ్ఞీ!"

"అయ్యో! మన్నించగలరన్న ధైర్యమే ఉంటే నిన్నింతగా బ్రతిమాలుకుంటానా రత్నా? ఒక్కసారి కడసారిగా దర్శనమయినా కటాక్షించవలిసిందని కాశ్మీర మహారాజ్ఞి శ్రీలేఖ పాదాలపై మోకరిల్లి ప్రాధేయపడుతున్నదని విన్నవించవే!"

చిన్నప్పటినించి మిక్కిలి గారాబంతో పెరిగి, అప్పటివరకు ఎడతెగని రాజసంతో బుసకొట్టిన శ్రీలేఖవంటి మహారాజ్ఞి ఆ తీరులో వావిడిచి వేడుకోగానే రత్నావళి మనస్సెంతో ఆర్ద్రమై కరిగి చెరువయింది.

"మీ పుట్టింట పరిచారికగా ఉన్నప్పటినించి నే నాయన నెరుగుదునమ్మా! అయితే మీ మనస్సులో ఇంతటి చిచ్చు రగులుకుంటున్నదని నే నెన్నడు గుర్తించలేకపోయానమ్మా!సరే. జరిగిపోయిన దానిని గురించి విచారిస్తే మాత్రం ప్రయోజన మేమిటి? నా శాయశక్తులా ప్రయత్నించి, ఒక్కసారి ఇక్కడికాయన తప్పక వచ్చేటట్టు ప్రయత్నిస్తాను.మీ రింక అధైర్యపడకండి!ఇదిగో నే నిప్పుడే బయలుదేరుతున్నాను. సెలవా మరి!"

అంతలోనే శ్రీలేఖ తటాలున లేచి నిలిచి ఆమె చేతులు

రెండు పట్టుకుని ఉప్పొంగుతున్న ఉత్సాహంతో ప్రతిమాలుతున్నది.

"ఈ ఉపకారమే కనక చేసిపెడితే నీ ఋణ మెన్నటికి తీర్చుకోలేనే! ఆయన దగ్గిర యేమని విన్నవించాలని ఆలోచిస్తున్నావే!"

"ఆ బరువంతా నామీద వదిలి వెయ్యండి మహారాణీ! ఆ ఉపాయమేదో నే నాలోచిస్తానుగా! మరి సెలవు దయచేయించండి."

నెమ్మదిగా నచ్చజెప్పిన రత్నావళి పట్టపురాణి పట్టు విడిపించుకుని శీఘ్రంగా అక్కడినించి బయలుదేరింది.

*   *   *

ఆనాటి దీపదీపాలవేళ ఆమె జయాకరుని భవనానికి పోయి సైన్య వ్యవహార పత్రాలేమో పరిశీలిస్తున్న అతనిని ఏకాంతంలోనే సందర్శించగలిగింది. ఆమెవైపు చూస్తూనే జయాకరు డాశ్చర్యపడ్డాడు.

"ఇదేమిటి రత్నావళీ, ఎన్నడు లేనిది ఇలాగ వచ్చావు!.... నన్ను పూర్తిగా మరిచేపోయావేమో అనుకున్నాను సుమా!"

"ఎంతమాట! మిమ్మల్ని నే నెన్నటికయినా మరిచిపోగలనా? నిజానికి మీరే మమ్మల్ని పూర్తిగా మరిచిపోయారు! అంతే!"

"'మమ్మల్ని' అంటే?"

బొమముడి విరిచాడు జయాకరుడు.

"ఈవేళ చైత్రపూర్ణిమ అన్న మాటే మరిచిపోయారా? నేడే కదా శ్రీలేఖాదేవిగారు జన్మించిన శుభ దివసము?"

"అవునవును!....సరే. ఇంతకీ నీ విక్కడికి వచ్చిన రాచకార్య మేమిటి?"

"ఏమని చెప్పమన్నారు! శ్రీలేఖాదేవిగారికి కీమధ్యన ఒంట్లో బొత్తిగా బాగుండడంలేదు! మిమ్మల్ని ఒక్కసారి కళ్ళారా చూడాలని ఆమె ఎంతయినా తహతహపడుతున్నారు!"

"నన్నా? శ్రీలేఖాదేవిగారా? కళ్ళారా చూడాలని తహతహపడుతున్నారా? ఎందుచేతనో?"

రత్నావళి నోట మాటలేక అలాగే విశ్ఫల నేత్రాలతో అతని

వైపు చూసింది. జయాకరు డామె కంటికి శ్రీలేఖకన్న చూపువాసి రూపసిగానే కనిపించాడు. బాగా కండలుదేరిన బలిష్ఠ శరీరంతో, కొంచెం గుండ్రంగా పెరిగిన బవిరిగడ్డంతో, గుబురులయిన కనుబొమల మధ్య వెడద కనుదోయితో, విశాలమయిన నెన్నుదుటితో ఎర్రగా మరిగిన పాలవంటి శరీచ్ఛాయతో మూడు పదులయినా నిండని వయస్సు ఘుమ్మరంతో అతడు పట్టపురాణి హృదయం చూరగొనడంలో ఆశ్చర్యమేమి లేదని ఆమె అనుకున్నది. అయితే జయాకరుని ప్రతిసమాధానం మాత్రం రత్నావళి కెంతో మొరటుగా, పట్టి కటికి గుండెనుండి వెలువడినట్టుగా స్ఫురించింది.

"ఎందుకలాగ విస్తుపోతున్నావు రత్నావళీ: నే నడిగిన ప్రశ్నలలో విడ్డూరమేమి ఉన్నది?"

జయాకరుడు తిరిగి వ్యవహార పత్రాల పరిశీలనలో పడ్డాడు.

"చిన్ననాటినించి మీ రామెమనస్సెరుగుదురుగదా? ఏమి తెలియనట్టు అలాగ అడగడం న్యాయమేనా? ఆమె ఒంట్లో బొత్తిగా బాగుండడంలేదని విన్నవించినా, ఆమాటే వినిపించుకోక వెటకారంగా అంటీఅంటనట్టు మాట్లాడడం మీ కుచితమేనా?"

జయాకరుడు తన వ్యవహార పరిశీలనం ముగించాడు.

"నీ వన్నది నిజమే రత్నావళీ:....కాదనడంలేదు:....కాని పట్టపురాణి కావాలన్న తహతహతోనే కదా, ఆమె కాశ్మీరాధిపతిని వివాహం చేసుకున్నది?"

రత్నావళి నిలువునా నిర్ఘాంత పోయి నెమ్మదిగా నచ్చ జెప్పింది.

"ఆమెమీద ఇటువంటి నింద మోపడంకన్న దురన్యాయమేమి లేదు: ఇది అంతా కేవలం మీ ఊహాపోహ: ఆ దైవం ముఖం చూసి చెబుతున్నాను ...నా మాట నమ్మండి:.... కేవలం తల్లిదండ్రుల బలవంతంవల్లనే ఆమె ఆనా డా వివాహాని కంగీకరించారు. మొట్టమొదట ఆమె కాశ్మీరాధిపతిని వివాహమాడేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. కాని మీ అత్తమామ లామె ప్రార్థన లక్ష్యపెట్టలేదు. తమ కుమార్తె పట్టపురాణి అయితేనే చాలునని ఆత్రపడ్డారు. నామాట

నమ్మండి! వివాహమయినప్పటినుండి సర్వదా ఆమె మిమ్మల్నే తలుచుకుంటున్నారు.....ఆమె మనస్సు మీకు మాత్రం తెలియదా. నాచేత పలికించాలని ఇలాగంటున్నారుకాని!"

ఈసారి నిర్ఘాంతపడడం జయాకరుని వంతయింది.

"నిజమేనా?"

"ఎంత మాట సెలవిచ్చారు! నే నెప్పుడయినా మీ దగ్గిర అబద్ధం చెప్పానా?"

నిజాని కామె తన మాటలలో కొంత అసత్యం మేళవించక పోలేదు. పోనీ ఆ విధంగానయినా అతని మనస్సు రవంత మెత్త బడగలదేమో అని ఆశపడింది. తన ప్రసంగ ఫలితం రవంత పొడ కట్టగానే తిరిగి అందుకున్నది:

"విపరీతమయిన అస్వస్థతవల్ల,సదా మీమీది ధ్యాసవల్ల పట్టపు రాణి కేవలం చిక్కి శల్యమయినారు! ఇక తామెంతో కాలం జీవించ మని పూర్తిగా నిరాశ చేసుకున్నారు! పుట్టిననాడయినా కడసారి ఒక్కమా రామెచనువు చెల్లించండి!మీ దర్శనభాగ్యం కటాక్షించండి! ....ఆహా! అంతటి మహారాణి తమ రాజసం అంతా విడిచిపెట్టి, మరి మానాభిమానాలమాటే తలపెట్టక మీ పాదాలమీద పడి ప్రాధేయపడు తున్నారు! అయినా మీ మనస్సు ఆవంతయినా మెత్తబడడంలేదు! ఎంతటి కటికి గుండె మీది!"

జయాకరు డాపైన కొంత మెత్తబడక పోలేదు! అయినా కేవలం తన అశక్తత మాత్రమే వ్యక్తీకరించాడు.

"ఎందుకలాగ అన్యాయంగా నామీద నింద వేస్తావు రత్నా వళీ! ఎవ్వరి కంట పడకుండా అంతఃపురంలో నే నెలాగ అడుగు పెట్టగలను చెప్పు? ఈ సంగతి ఎవరయినా పసికడితే మా ఇద్దరి ప్రాణాలమీదికి రాదా? ఇవన్ని తెలిసి ఉండికూడా ఎందుకలా నామీద లేనిపోని నిష్ఠురం వేస్తావు?"

మరుక్షణంలోనే రత్నావళి అందుకున్నది:

"రెండవ కంటివారి కెవ్వరికి తెలియకుండా అతి రహస్యంగా

మిమ్మల్ని పట్టపురాణి శయ్యాగారానికి చేర్చే పూచీ నాది....సరి కదా....''

''ఎలాగ చేరుస్తావు, రత్నావళీ....! అది నీ వన్నంత తేలిక కాదే?''

జయాకరుని గొంతులో విసుగుదల విస్పష్టంగా ప్రతి ధ్వనించింది.

''శిథిలమయిన శ్రీదేవి ఆలయంలోనుండి అతి రహస్య మయిన సురంగ మార్గ మొకటి తిన్నగా పట్టపురాణి భవంతిలోనికి పోతున్నది. ఆ దారి నాకు, మహారాణికి తప్ప వేరెవ్వరికి తెలియదు. దానిద్వారా సురక్షితంగా, అతి త్వరితంగా మిమ్మల్ని అక్కడికి తోడు కొని పోగలను....సరికదా!''

జయాకరు డిక కాదనలేక నీళ్ళు నమిలాడు.

''ఏమో మరి! అక్కడ అంతఃపురంలో కావలివారి కెవ్వరి కయినా కంటపడతానేమో!''

''ఆ ఆందోళన మీ కక్కరలేదు! ఆ జాగ్రత్త నేను పడ తానుగా! ఇదిగో....మనసారా మీమీద ప్రాణాలు పెట్టుకున్న పట్టపు రాణి కొక్కమారు కడకంటి చూపు ప్రసాదించండి! ఇక ఎంతో కాలం జీవించమని నిరాశ చేసుకున్న ఆమె కట్టకడపటి కోరిక కాదన కండి! నా మనవి రవంత చిత్తగించండి!''

''సరేలే!''

జయాకరు డెట్టకేలకు అతి కష్టంమీద తన అంగీకారం వ్యక్తీ కరించాడు.

''అయితే ఈరాత్రి రెండోజాము ముగియకమునుపే అతి రహస్యంగా తిరిగి మీ భవంతికి వచ్చి మిమ్మల్ని శ్రీదేవి శిథిలాల యానికి వెంటబెట్టుకుపోతాను....సెలవా మరి!''

జయాకరు'డలాగే' అని దాని కంగీకరించిన పిమ్మట రత్నావళి సగౌరవంగా వీడ్కొని వెంటనే శ్రీలేఖ సౌధానికి మరలిపోయింది. జయాకరుని వాగ్దాన శుభవార్త ఆమె చెవిని వేసి, అతని భవంతిలో తమ ఇద్దరిమధ్య జరిగిన సంభాషణ సంగ్రహంగా వెల్లడించింది.

జయాకరుడు విచ్చేసిన కొంతసేపటివరకయినా విపరీతంగా అస్వస్థతగా ఉన్నట్లు అభినయించవలసినదని వేడుకున్నది. శ్రీలేఖ ఆమె అత్యద్భుత చాకచక్యాని కెంతో అక్కజపడి, ఆప్యాయంగా అక్కున చేర్చుకుని అభినందించింది.

* * *

రత్నావళి అందించిన శుభవార్త యథార్థమే అని మొట్టమొదట కొంతసేపటివరకు పట్టపురాణి నమ్మలేకపోయింది. కాని జయాకరులు తప్పక విచ్చేయగలరని ఆమె గట్టిగా మాట ఇచ్చిన పిమ్మట, తన ప్రాణాపాయవార్తవల్ల అతని కొకవేళ రవంత జాలి కలిగి ఉండవచ్చునని సమాధానపడింది.

రెల్లు పూలరేకుల జల్లులవంటి తెల్ల తెల్లని వెలుగులతో ఆనాటి చైత్రపూర్ణిమ మహారాణి కొకింత మైమరుపే కలిగించింది.చాలాకాలం క్రితం చిన్నతనంలో జయాకరునితో కలిసి అటువంటి పున్నమి వెన్నెలలో అమాయకమయిన ఆనందంతో విహరించిన మనోహర క్షణాలన్ని ఆ సమయంలో ఆమె స్మృతి వీథిలో సాక్షాత్కరించాయి. మరుచటి నిమేషాన్ని గురించి ఆలోచించుకోవలసిన అవసరమేలేని అటువంటి సంతోష పారవశ్య సమయం మరి తిరిగిరాదని తలపోసి ఉసూరుమని ఒక వేడి నిట్టూర్పు విడిచిపెట్టింది శ్రీలేఖ.

అంతలోనే జయాకరుని రాక సంగతి ఆలోచించుకుని ఉప్పొంగుతున్న ఉత్సాహ పారవశ్యంతో 'ఇన్నాళ్ళకిగదా, నా కోరిక ఫలించింది.' అని ఎంతయినా మురిసిపోయింది. ఆ విధమయిన ఆలోచనలతో క్రమక్రమంగా రాత్రి రెండవజాము సమీపించేసరికి తాను కట్టుకున్న చీర అందంగా లేదని వేరొక చీర ధరించింది. అంతలోనే అది బాగాలేదనుకుని తిరిగి వేరొక చీనాంబరంతో తన సోయగానికి మెరుగులు దిద్దుకున్నది.

జాజ్జ్వల్యమాన దీపికల వెలుగులో నిలువు టద్దంముందు నిలిచి ముంగురులతోబాటు ముత్యాల హారాల తీరు తిన్నగా సవరించుకున్నది.మాటిమాటికి శయ్యాగృహం ద్వారంముందు నిలిచి, జయాకరునితోబాటు రత్నావళి రాకకోసం నిమేష మొక యుగంగా నిరీ

క్షించింది. అతడు విచ్చేసిన పిమ్మట హాయిగా విశ్రమించడానికి కను కూలమయిన బంగారుపూత శయ్యాసనంమీద జాజిపూలరేకులు కోకొల్లలుగా ఒత్తుగా పరిచింది.

అంతలోనే ఏదో అలికిడి విని తటాలున ద్వారంవైపు పోయి నలువైపుల పరకాయించి చూసింది. 'ఒకవేళ అకస్మాత్తుగా ఏదయినా అవాంతరం వచ్చి విచ్చేయడమే విరమించుకున్నారేమో!' అనుకుని ఉసూరుమని నిట్టూర్చి గుడ్ల నీరు కుక్కుకున్నది.

అయితే మరికొన్ని క్షణాలలోనే రత్నావళి అతి త్వరితంగా లోపలికి వచ్చి విన్నవించింది.

"మహారాణీ! ఇదిగో జయాకరు లిప్పుడే ఇక్కడికి విజయం చేస్తున్నారు!"

"నిజంగానేనా రత్నా!"

"అయ్యో! మీ కింకా నమ్మకం కలగడం లేదా? నిజమే నమ్మా!"

రత్నావళి వెంటనే అక్కడినించి నిష్క్రమించి,జయాకరునితో తిరిగివచ్చింది. అతనికోసమని ప్రత్యేకించి ఏర్పరచిన శయ్యాసనంపై విశ్రమింపజేసి, శ్రీలేఖ కెంతో అడకువతో నమస్కరించి సెలవు తీసుకున్నది. శయ్యాగృహం తలుపు మూసివేసినంత ఓరగా వేసి, వెనువెంటనే అక్కడినించి బయటపడింది.

శ్రీలేఖ తన శయ్యాసనంమీద పద్మరాగ ప్రతిమలాగ అలాగే నిశ్చలంగా కూర్చుండిపోయింది. ఆమె విసీలనేత్రా లాశ్చర్యంతో, ఆనందపారవశ్యంతో మరింత విశాలంగా వికసించాయి. ఎంతసేప టికి రెప్పపాటే లేని శ్రీలేఖ నేత్రద్వయి పరిశీలించి జయాకరు డెంతో ఆందోళన పడ్డాడు.

"శ్రీలేఖా! అదేమిటి అలాగ చూస్తున్నావు! నీ ఒంట్లో ఆరో గ్యంగా ఉన్నదా?"

అంతలోనే ఆమె తటాలున లేచి, సమీపంలో అతని కెదు రుగా ఉన్న వేరొక శయ్యాసనంపై విశ్రమించి, జయాకరుని చేతులు

రెండు దగ్గరగా చేర్చి తనివిదీరా గట్టిగా ముద్దు పెట్టుకుని నేత్రాంతా లోకింత కుంచించింది.

"ఇంత కాలానికి నామీద జాలి కలిగిందా, జయాకరా నీకు! నీవు నా ఎదటే కూర్చున్నా, 'ఒకవేళ ఇది కల కాదుగదా!' అని నే నాశ్చర్యపడుతూనే ఉన్నాను! రెప్పపాటువల్లనే నీ రూపు కను మరుగయిపోగలదేమో అని భయపడుతున్నాను! ఇంతకన్న ఏమని విన్నవించుకోగలను జయా నేను!...ఇక నా ఆరోగ్యంమాటా! నా కేమి, నిక్షేపంలాగున్నాను!....నిన్నొక్కమారు కళ్ళారా చూసుకోవా లన్న తహ తహతోనే రత్నచేత అలాగ కబురు పంపించాను. అంతే!"

జయాకరు డా సమాధానం విని తన కన్నులే నమ్మలేక పోయాడు.

"శ్రీలేఖా! ఒక్కమాట అంటున్నానుగాని, వేరొక విధంగా ఆలోచించి మనస్సు కష్టపెట్టుకోకు!....నీవంటే నాకిష్టం లేకపోలేదు సుమా!....అయితే నీ విన్నాళ్ళనుండి మహారాజ్ఞీ గౌరవంతో మన్నన లందుకుంటున్నావు గదా! ఇటువంటి దానవు రవంత మన గౌరవ మర్యాదల సంగతి ఆలోచించుకోవద్దా! ఇది ఎవ్వరికయినా తెలిస్తే నా మానాభిమానాలన్నీ మంటగలిసి పోవా?....నీకిది న్యాయమేనా?"

శ్రీలేఖ కామందలింపుతో తటాలున తల కొట్టివేసినట్టయింది! వంచిన తల మరి పైకెత్త లేక అలాగే దోసిట ఉంచుకుని విపరీత వేదనతో కుమిలి కుమిలి దుఃఖించింది. మరికొంతసేపటి కతి కష్టం మీద తన్ను తానే సంబాళించుకుని అతనివైపు చురచుర చూపి లోలోపలి ఆక్రోశమంతా ఒక్కమాటుగా వెళ్ళ గక్కింది.

"ఎంతసేపు నీమానాభిమానాల మర్యాదల మాటేగాని, నాకు జరిగిపోయిన ఘోరదురన్యాయంసంగతిఎన్నడయినా ఒక్కమా రాలోచించుకున్నావా?....అయ్యో! కన్న తల్లి దండ్రులే అన్యాయం చేసి, తమ ఐశ్వర్యాధికారాలకోసమని నన్ను కేవలం బలిపశువుగా

వినియోగించు కున్నప్పుడు ఇంకొకరి సనవలిసిన పని ఏమి ఉన్నది? ....అయ్యో! పట్టి కటికి కసాయికి మన స్పర్పించుకుని విపరీత వ్యథతో విలవిల లాడిపోతున్న నన్నింక ఆదుకునే వారెవ్వ రున్నారు!"

శ్రీలేఖ అదే ధోరణిలో కన్నీరు మున్నీరుగా విలపించింది! అది గమనించిన జయాకరుని మనస్సు కొంచెం మెత్త బడింది. నెమ్మదిగాలేచి ఆమె నక్కన జేర్చుకుని బ్రతిమాలుకున్నాడు.

"నామాటవిని కొంచెం మనస్సు సంబాళించుకో శ్రీలేఖా! ఇక ఇప్పు డీ గతజల సేతు బంధనంవల్ల ప్రయోజన మేమిటి చెప్పు! నీ కింతటి దురన్యాయం జరిగిపోయిందని రత్నావళివల్ల నాకింతకు మునుపే తెలిసింది! లేకపోతే నీమీద నాకింతటి అక్కసు్స కలిగి ఉండేది కాదు!....నిజమే! తెలియక నేను కూడా నిన్ననేక విధాల హింసించాను. నావల్ల పెద్ద తప్పిదమే జరిగిపోయింది !నన్ను మన్నించు! ఆ దైవ సంకల్పమే ఆ విధంగా తిరిగినప్పుడింక మానవ మాత్రులం మనమేమి చెయ్యగలం చెప్పు!"

అప్పటికి శ్రీలేఖ పెదవి మీద మల్లెమొగ్గవంటి చిరునవ్వు మొలకెత్తింది.

"నిజంగా నామీద నీ అక్కసంతా పూర్తిగా తొలగి పోయిందా జయాకరా! లేక ఊరికే నా కళ్ళ నీళ్లు తుడిచి తప్పించుకు పోవడాని కిలాగ అంటున్నావా?"

"లేదు లేదు, శ్రీలేఖా! నిజంగానే నేటితో నా మనస్సులో గూడుకట్టుకున్న అపోహ, అక్కసు్స—అన్ని పూర్తిగా తొలగి పోయాయి"

శ్రీలేఖ ముఖం మరింతగా కలకలలాడింది.

"అయితే నేనొక్క కోరిక కోరుకుంటాను గాని, కాదనక తప్పక నెరవేరుస్తావా?"

జయాకరుడు మరింత ఆప్యాయంగా బుజ్జగించాడు.

"అలాగే! దానికేమి? తప్పక నెరవేరుస్తాను....ఇంతకి ఏమిటి నీకోరిక?"

''ఏమి లేదు! ఇదిగో! ఇప్పుడే నావేలి వజ్రపు టుంగరం
మింగివేసి నేనిలాగే నీ ఒడిలో వాలి మరణించాలని ఉవ్విళ్ళూరు
తున్నాను....ఇంతటి గొప్ప ఆనందం చవిచూపిన పిమ్మట,
ముమ్ముందు దేనికెటువంటి విఘాతం కలగగలదో అని భయపడు
తున్నాను....నా కోరిక చెల్లించవా!''

''ఎంతటి మాటన్నావు శ్రీలేఖా! మన ఆనందాని కింక విఘా
తమా!అది ఎన్నటికీ జరగనేరదు! అప్పుడప్పుడు నేనిలాగే ఇక్కడికి
వస్తూ పోతూంటాను! సరికదా!''

జయాకరు డామె అనుమానం పూర్తిగా తొలగించలేక
పోయాడు.''

''అయితే చేతిలో చెయ్యివేసి, అదిగో ఆనిండు జాబిల్లి
సాక్షిగా మనఃపూర్వకంగా ప్రమాణం చెయ్యి!''

అలాగే అని అంగీకరించి ఆమె కోరినట్టుగానే ప్రమాణం
స్వీకరించి, తిరిగి ఆమె నాలింగనంతో బంధించి ముంగురులపై ముద్దు
పెట్టుకున్నాడు జయాకరుడు. అదేసమయంలో అతని కోసమై తాను
పడిన తపన అంతా వెళ్ళబోసుకోవడం ప్రారంభించింది శ్రీలేఖ. ఆ
ధోరణిలో పడి మైమరిచిన వారిరువురు అలాగ ఎంతకాలం గడిచిందో
గమనించనే లేదు!

మరికొంత సేపటికి మహారాజాంతఃపురంలో వంది మాగ
ధుల చేసిన మేలుకొలుపుల కోలాహలం ప్రారంభమయింది. జయా
కరు డుత్తర క్షణంలోనే ఆమె ప్రగాఢాశ్లేషబంధనంలో నుండి
నెమ్మదిగా విడిపించుకుని లేచి నిలుచున్నాడు.

''అంతఃపురంలో పరిచారికాపరిచారకులందరు అప్పుడే మేలు
కుంటున్నట్టున్నారు శ్రీలేఖా! నేనింక తొందరగాబయలుదేరక తప్పదు!
వెళ్ళిరానా మరి?''

విపరీతమయిన అతని ఆత్రతలో అనుమానించ దగిన
ధోరణి ఏదో తటాలున శ్రీలేఖ నిండు గుండెలో దూసుకుపోయింది!
తన్నేదో విధంగా బ్రతిమాలుకుని బుజ్జగించి, వెనువెంటనే అక్కడి
నించి తప్పించుకుని బయట పడిపోవాలని ఆలోచిస్తున్నాడని ఆమె

క్షణంలో పసికట్టివేసింది. ఇంకెన్నడు మరి తిరిగిరాడేమో అని కూడా ఆందోళన పడింది.

"అయ్యో! తరలిపోతున్నావా జయాకరా! ఇంక నీవిక్కడి కెన్నడు తిరిగిరావు కాబోలును!అయ్యో! అప్పుడే వెళ్ళిపోకు!ఇంకొక్క మారు నీ ముఖం కళ్ళారా చూసుకోనీ!"

తాను తప్పక అలాగే వస్తూపోతూండగలనని తిరిగి గట్టిగా మాట ఇచ్చాడు జయాకరుడు. అయినా శ్రీలేఖ మనస్సులో పెద్ద అనుమాన మేదో పట్టుకుని వేధించసాగింది.

"నీ వింకెన్నడు ఇక్కడికి తిరిగిరావు జయా! నీ ధోరణినిబట్టి నేనామాత్రం గ్రహించుకోలేననుకున్నావా?.....పోనీలే! నేనింతే పెట్టిపుట్టాను కాబోలును!

"పోనీ, ఆకాశంలో పున్నమి జాబిల్లి కంట బడినప్పుడయినా మనసారా నన్నొక్కమారు తలుచుకో! ప్రతి పౌర్ణమినాడు చంద్రుడుదయించినది మొదలు అస్తమించే పర్యంతము రెప్పపాటయినా లేక ఆ బింబం కేసి చూస్తూ నిన్నే తలుచుకుంటాను! కడసారిగా నా కీ చిన్న కోరిక అయినా అనుగ్రహించు! నాకిదే పదివేలు!"

జయాకరు 'ఆలాగే' అని మాట ఇచ్చి, పట్టపు రాణిని తిరిగి తన బిగి కౌగలింతలో బంధించి, కనుదోయిపై చిక్కని ముద్దు ముద్రికలతో వీడ్కొని వెనుదిరిగి చూస్తూ తొందర తొందరగా రహస్య సురంగంలో ప్రవేశించి క్రమక్రమంగా అదృశ్యుడయినాడు.

గవాక్షంలో నుండి వరద వెల్లువలా వెలువడుతున్న వెన్నెల వెలుగులలో ఆనాటి చైత్ర పూర్ణిమా సుధాకరునిపై పవలోకిస్తూ శ్రీలేఖ అలాగే తన శయ్యాసనంపై కూలబడిపోయింది.

అప్పటి కామె ఆశ అంతా పూర్తిగా అడుగంటి పోయింది! అయినా, శ్రీలేఖ చూపు లలాగే నిండు జాబిల్లి మీద నిశ్చలంగా నిలిచాయి!

---